ప్రైవేట్ నెట్‌వర్క్‌కు దీటుగా బీఎస్ఎన్ఎల్

● నిరంతరాయ సేవలు ● తక్కువ ధరతో కొత్త ప్లాన్లు ● పెరుగుతున్న వినియోగదారులు


భీమిలిలోని బీఎస్ఎన్ఎల్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్


కార్యాలయంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్

భీమునిపట్నం: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ప్రైవేట్ నెట్‌వర్క్‌కు దీటుగా సేవలందిస్తోంది. కొద్ది సంవత్సరాల క్రితం భీమిలిలో ఈ నెట్‌వర్క్ కనుమరుగయ్యే దీనస్థితి నుంచి మెల్లగా పుంజుకుంటోంది. నిరంతరాయంగా అందుతున్న సేవలపై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సమష్టి కృషితో..

భీమిలి ప్రధాన కేంద్రంగా గల కార్యాలయంలో ఇబ్బందికరంగా ఉన్న పరిస్థితులను గాడిలో పెట్టేందుకు అధికారులు మూడేళ్లుగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇక్కడ ముగ్గురు సిబ్బంది.. జూనియర్ టెలికం అధికారి జేటీవో, టెలికం టెక్నీషియన్ టీటీ, జూనియర్ ఇంజినీర్ ఉన్నారు. ప్రస్తుతం భీమిలి, ఆనందపురం, పద్మనాభం పరిధిలో మొత్తం 2,326 మొబైల్ కనెక్షన్లు ఉన్నాయి, అలాగే 12 టవర్లు ఉండగా, అన్నీ ఇబ్బంది లేకుండా పని చేస్తున్నాయి. ఇంకా నాలుగు కొత్త టవర్లు రానున్నాయి. గతంలో ప్రతి నెలా 20 నుంచి 30 వరకు మాత్రమే కొత్త కనెక్షన్లు వస్తుండగా ఇప్పుడు నెలకు 60కి పైనే కనెక్షన్లు తీసుకుంటున్నారు. మరి ముఖ్యంగా ఇటీవల ప్రైవేటు నెట్‌వర్క్‌ల చార్జీలు బాగా పెరిగిపోవడంతో ఇప్పుడు చాలామంది బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారు.

ఆకర్షణీయమైన ప్లాన్లతో..

ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ ప్లాన్ల విషయంలో ప్రైవేటు నెట్‌వర్క్‌ల కన్నా తక్కువ ధరలు, ఎక్కువ జీబీ వచ్చేవి ఉండడంతో పేద, మధ్య తరగతి వారికి ఎంతో సదుపాయంగా ఉంది. అలాగే ఫైబర్ నెట్‌వర్క్ అందుబాటులోకి రావడంతో మరింత హైస్పీడ్ ఇంటర్‌నెట్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. దీంతో పాటు పలు ఓటీటీల ఆఫర్లు కూడా ఆయా పోస్ట్ పెయిడ్ ప్లాన్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఇదేకాకుండా కొత్తగా కేజీ మోడల్ ప్లాన్ అందుబాటులో ఉంది. దీని ప్రకారం ఒకే చోట వంద ఫ్లాట్లు ఉన్న అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీ ప్రాంతాల్లోని వారు బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌లు తీసుకువంటే వారి ప్లాన్లకు పది శాతం రాయితీలు ఇస్తున్నారు. ఇలా ఆకర్షణీయమైన ఆఫర్లతో నష్టాల నుంచి గట్టెక్కి, గతంలో కన్నా రెండు శాతం ఆదాయం పెరిగి లాభాల బాటలో పయనిస్తోంది.

కస్టమర్ సర్వీస్ సెంటర్ ద్వారా సేవలు

ఇక్కడ కస్టమర్ సర్వీస్ సెంటర్ అందుబాటులో ఉంది. ప్రైవేట్ ఏజెన్సీ దీన్ని నిర్వహిస్తోంది. ఇక్కడ కొత్త బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు పొందవచ్చు, ప్రీ పెయిడ్, పోస్ట్‌పెయిడ్ బిల్లులు, ఫైబర్ నెట్‌వర్క్ బిల్లులు చెల్లించవచ్చు. అలాగే కొత్త ఆధార్ కార్డులు పొందడం, ఆధార్ లింకులు, తప్పులు సరిచేయడం మొదలైన సేవలను అందిస్తున్నారు.

సిగ్నల్ బాగుంది



ఇంతకు ముందు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సిగ్నల్ సరిగ్గా ఉండేది కాదు. దీంతో ఇంటర్‌నెట్ సేవలు అంతంతమాత్రంగా ఉండేవి. ఇప్పుడు ఆ సమస్య లేదు. సిగ్నల్ చాలా బాగా ఉంటోంది. అన్ని ప్రాంతాల్లో బాగా పని చేస్తోంది.

– పైల రాము, భీమిలి

అందుబాటులో రీచార్జి ప్లాన్లు



బీఎస్ఎన్ఎల్‌లో పలు రీచార్జి ప్లాన్ల రేట్లు తక్కువగా ఉన్నాయి. ప్రైవేట్ నెట్‌వర్క్‌ల చార్జీలు గతంలోనే ఎక్కువగా ఉండేవి, ఇప్పుడు మరింత పెంచేయడంతో సామాన్యులకు కష్టం అయిపోతోంది. అటువంటి వారికి బీఎస్ఎన్ఎల్ ప్లాన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

– టి. వెంకటేష్, మామిడిపాలెం

ప్రత్యేక శ్రద్ధతో సేవలు



వినియోగదారులకు ప్రత్యేక శ్రద్ధతో సేవలను అందించే విషయంలో అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిగ్నల్ సమస్యలతో పాటు ఇతర ఏ సమస్యలపై అయినా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి, పనులు చేయిస్తున్నాం. అందరికీ అన్ని ప్రాంతాల్లో చాలా చక్కని సేవలు అందుతున్నాయి. ప్రైవేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా బీఎస్ఎన్ఎల్ ఇప్పుడు పని చేస్తోంది.

– పి.చంద్రశేఖర్, జూనియర్ టెలికం అధికారి, భీమిలి

పద్యపఠన, వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

తగరపువలస: ఈ నెల 29న తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్ ఆధ్వర్యంలో తెలుగుభాష ఆవశ్యకతపై విద్యార్థులకు పద్యపఠన, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 27న ఉదయం 9.30 గంటలకు స్కూల్ వద్ద ఈ పోటీలు నిర్వహిస్తారు. 5 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఒక వర్గంగా, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మరో వర్గంగా ఈ పోటీలు నిర్వహించనున్నారు. వివరాలకు 80746 33106, 70134 11907 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

లాంగ్ జంప్ పోటీల్లో ధనుష్ ప్రతిభ

● రాష్ట్రస్థాయిలో రజతపతకం కైవసం


పతకం, సర్టిఫికెట్‌తో ధనుష్

తగరపువలస: ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలలో ఆనందపురం మండలం గుడిలోవకు చెందిన సరస్వతీ విద్యావిహార్ పదో తరగతి విద్యార్థి ముద్రగడ ధనుష్‌కు రెండో స్థానం లభించింది. ఈ సందర్భంగా ధనుష్‌కు రజత పతకంతో పాటు సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందించారు. పద్మనాభం గ్రామానికి చెందిన ఈ విద్యార్థిని విద్యావిహార్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

బంగారమ్మ తల్లికి పసుపు కుంకుమలు


ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ తల్లి

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామదేవత బంగారమ్మ తల్లి వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ వాసులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. గులాబీ, బంతి, చామంతి పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద నేలవేషాలు, బాణసంచా, పులివేషాలతో సందడి కనిపించింది.

రాజ్‌కుమార్ నియామకం

తగరపువలస: అంతర్జాతీయ న్యాయ సేవా మండలి ఆర్గనైజింగ్ సెక్రటరీగా జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్టకు చెందిన కె.రాజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈయనకు మంగళవారం విజిలెన్స్ కమిటీ జాతీయ కార్యదర్శి విభాగం సుధాకర్ చేతుల మీదుగా నియామక పత్రం అందించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ మండలి వ్యవస్థాపకురాలు, చైర్మన్ అనూషా రాథోడ్ ఆధ్వర్యంలో మానవ హక్కుల పరిరక్షణకు పని చేస్తానన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమునిపట్నం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని భీమిలి సమీపంలోని బ్యాంక్ కాలనీ వద్దనున్న కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎ.వి.వర్మరాజు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ 1980ల్లోనే దేశానికి సాంకేతికతను పరిచయం చేసిన దార్శనికుడని రాజీవ్‌ను కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ గాదం మహేష్, నాయకులు పడాల రమణ, పొట్టి రజనీకాంత్, కాట సన్యాసిరావు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన ఇద్దరు అరెస్ట్

తగరపువలస: రైల్వేలో ఉద్యోగాల పేరుతో మోసగించిన ఇద్దరు వ్యక్తులను ఆనందపురం పోలీసులు మండలంలోని వెల్లంకి రోడ్డు వద్ద మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15 వేలు రికవర్ చేశారు. ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన ఎద్దు వెంకటలక్ష్మిని నగరంలోని నీలమ్మ వేప చెట్టు ప్రాంతానికి చెందిన దాదిరావు నరేంద్ర కుమార్ పట్నాయక్, పెందుర్తి సుజాతనగర్‌కు చెందిన సుగ్గు వెంకట శ్రీధర్ నమ్మించారు. ఆమె నుంచి ఈ నెల 14న డబ్బు వసూలు చేశారు. తరువాత విచారించగా తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు దిశ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జి.మల్లేశ్వరిని ఆశ్రయించారు. ఆమె సూచనల మేరకు బాధితురాలు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సీఐలు టీవీ తిరుపతిరావు, జి.మల్లేశ్వరి, ఎస్ఐలు పి.శివ, ఎన్.గౌరి, హెడ్ కానిస్టేబుల్ ఎస్.వాసు, కానిస్టేబుల్ కె.బాలకేశవ తదితరులు విచారించి, నిందితులను అరెస్ట్ చేశారు.

15న 'టెంట్ ఎక్స్‌పో'

సీతమ్మధార : వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో 'టెంట్ ఎక్స్‌పో' నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. సీతమ్మధారలోని ఫంక్షన్ హాలులో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి సారిగా భారీ స్థాయిలో ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సప్లయర్స్ రంగాన్ని చిన్న తరహా పరిశ్రమగా గుర్తించాలని కోరారు.

16వ పోలీస్ బెటాలియన్‌కు క్యాష్ రివార్డ్


పెరేడ్‌లో పాల్గొన్న అధికారులకు నగదు రివార్డు అందజేస్తున్న ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం: విజయవాడ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో నిర్వహించిన పోలీస్ పెరేడ్‌లో బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌కు మొదటి బహుమతి లభించిందని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు తెలిపారు. వారికి షీల్డు, రూ.20 వేలు నగదు బహుమతిగా అందించారని చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన అభినందన సభలో పెరేడ్ సభలో పాల్గొన్న అధికారులను ప్రశంసించారు. వారికి క్యాష్ రివార్డును అందజేశారు. కార్యక్రమంలో భాగంగా డీజీపీ కమెండేషన్ డిస్క్ బ్రాంజ్‌ను ఏఆర్ఎస్ఐ బి.రామానుజన్‌కు కమాండర్ అందించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌లు పి.దేవానంద్‌రావు, పి.సత్యం, వి.నారాయణ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

మొదలైన ఓటర్ల జాబితాల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఇంటింటికీ ఓటర్ల జాబితాల పరిశీలన కార్యక్రమం మళ్లీ ప్రారంభమైందని ఇన్‌చార్జి ఆర్డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ లెవెల్ అధికారులు, సిబ్బంది ఈ పరిశీలన నిర్వహిస్తారని, డిసెంబర్ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మిగిలిపోయిన కొత్త ఓటర్లను జాబితాల్లో చేరుస్తారని, మరణించిన వారి పేర్లు తొలగించడం వంటి మార్పులు చేర్పులతో పాటు ఏమైనా ఇబ్బందులుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఏ పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల ఓట్లు అక్కడే ఉండే విధంగా నమోదు చేస్తామని, దూరప్రాంతాలకు వెళ్లే ఇబ్బందుల్లేకుండా చూస్తామని చెప్పారు. జాబితాల పరిశీలనలో తప్పులు జరగకుండా జాగ్రత్తలను తీసుకుంటున్నామని, రాజకీయ నాయకులు కూడా సహకరించాలని కోరారు. డిసెంబరు నెలాఖరు నాటికి కొత్త జాబితాలను పూర్తి చేసి, జనవరిలో వివరాలు వెల్లడిస్తామన్నారు. సమావేశంలో నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, గంటా నూకరాజు, భాగం గోపాలరావు, తహశీల్దారు పైల రామారావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై వివాదం


వలందపేటలో దిమ్మెపై ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు వలందపేటలో లో వోల్టేజీ సమస్యల పరిష్కారం నిమిత్తం విద్యుత్‌శాఖ మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండగా సంగివలస శశి విద్యాసంస్థల ప్రతినిధులు అడ్డు తగిలారు. విద్యాసంస్థల వెనుక డ్రైనేజీపై ఇరవై రోజుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సిమెంట్ దిమ్మె నిర్మిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే సమయంలో అడ్డు తగలడంతో వలందపేట వాసులు శశి విద్యాసంస్థల ప్రతినిధులకు ఎదురు తిరిగారు. స్థానికుల పట్ల మీ దురుసుతనం ఏమిటని ప్రశ్నించారు. ఎలాగైనా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయవలసిందేనని భీష్మించుకుని కూర్చున్నారు. విద్యుత్‌శాఖ ఏడీ రమేష్ కలగజేసుకుని ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే పనులు నిలిపివేస్తామని, తరువాత మరోమారు పనులు చేసే సమయంలో ఖర్చులు వారే భరించవలసి ఉంటుందని స్పష్టం చేశారు. శశి ప్రతినిధులు ఒకరోజు గడువు కోరగా 20 రోజులుగా ఏం చేస్తున్నారని వలందపేట వాసులు ప్రశ్నించడంతో, వెనక్కు తగ్గారు. ఎట్టకేలకు గ్రామస్తులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోగలిగారు. ఏడీ రమేష్ మాట్లాడుతూ వలందపేటలో దీర్ఘకాలంగా ఉన్న లో వోల్టేజీ సమస్య పరిష్కారమైందన్నారు. చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ బొట్టా రవి పాల్గొన్నారు.

డాక్టర్ కోసం రోగుల నిరీక్షణ

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లోని స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీలో డాక్టర్ సకాలంలో రాకపోవడంతో రోగులు నిరీక్షించాల్సి వచ్చింది. వైద్యురాలు ఉదయం 9 గంటలకు రావాల్సి ఉండగా, మంగళవారం ఉదయం 10.30 గంటల వరకు కూడా రాలేదు. దీంతో పదుల సంఖ్యలో రోగులు ఆమె కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. మరికొందరు చేసేది లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇప్పటికే యూపీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యుల సేవలను కూటమి ప్రభుత్వం ఎత్తివేసి, వ్యవస్థనే నీరు గార్చే ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు ఉన్న ఒక్క డాక్టర్ కూడా సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై వైద్యురాలు మానసను వివరణ కోరగా తమకు చాలా పనులు ఉంటాయని చెప్పారు. అయినా, ఈ రోజు 80కేసులు చూశానని తెలిపారు.



ఖాళీగా ఉన్న డాక్టర్ చాంబర్, డాక్టర్ కోసం నిరీక్షిస్తున్న రోగులు

340 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

తగరపువలస: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఆనందపురంలో 340 పశువులకు మంగళవారం ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ టీకాలపై అపోహలు వీడాలన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ పాడి పశువులకు ఈ టీకాలు ఇప్పించాలని సూచించారు.

కాలుష్య రహిత ఇంధనంగా హైడ్రోజన్

కొమ్మాది: కార్బన్ సమస్య లేకుండా కాలుష్యం లేని హైడ్రోజన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. సింథటిక్ ఫ్యూయల్‌పై బీచ్‌రోడ్డులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వద్ద గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బీఎస్‌సీఈ సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సులో, రెండో రోజు వారు మాట్లాడారు. అణు విద్యుత్‌తో పాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేసుకోవలసిన అవసరాలను భారత్, అమెరికాతో పాటు పలు దేశాల శాస్త్రవేత్తలు వివరించారు. అలాగే, హైడ్రోజన్ ఇంధనం వల్ల ఎటువంటి మంచి జరుగుతుంది, దాని వినియోగం ఎలా ఉందన్న వాటి గురించి కూడా చర్చించారు. కార్యక్రమంలో వీటీ ఇండియా న్యూక్లియర్ ఎనర్జీ పార్ట్‌నర్‌షిప్ డైరెక్టర్ ప్రొఫెసర్ మైనేని గణపతి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, గీతం విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సర్దుబాటు మండలానికే పరిమితం చేయాలి'

పద్మనాభం: ఉపాధ్యాయుల సర్దుబాటును మండలానికి పరిమితం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. సర్దుబాటును మండల స్థాయిలో పూర్తి చేసిన తర్వాతే ఉపాధ్యాయుల అనుమతితో డివిజనల్ స్థాయిలో జరపాలని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలను అర్హతలు ఉన్నాయన్న నెపంతో, వారికి ఇష్టం లేకపోయినా ఉన్నత పాఠశాలలకు కేటాయించడం అన్యాయమన్నారు. ఎస్జీటీల ఐచ్ఛికాన్ని పరిగణనలోకి తీసుకుని ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయాలని కోరారు.

బీఎల్‌వోల గౌరవవేతనంపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న అసోసియేషన్ నాయకులు

మధురవాడ: విశాఖ జిల్లాలో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), బూత్ లెవెల్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న వారికి గౌరవ వేతనం బకాయిలను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను మంగళవారం కలసి, వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గతంలో కొంత మేర గౌరవ వేతనం విడుదల చేశారని, మిగిలిన మొత్తాన్ని పూర్తి స్థాయిలో ఇప్పించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు వారు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భార్గవ్ సుతేజ్, జిల్లా నాయకులు రియాజ్‌ఖాన్, పైడిరాజు, శివ తదితరులున్నారు.

కాలుష్యంపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

తగరపువలస: కాలుష్యం వల్ల పర్యావరణానికి కలిగే హాని, మానవాళి మనుగడకు కలిగే ముప్పు గురించి జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో మంగళవారం వారు పర్యటించారు. స్ప్రింట్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ నుంచి బయటకు విడుదలవుతున్న నీటి కాలుష్యాన్ని పరిశీలించారు. ఎవర్‌గ్రీన్ ప్లైవుడ్ కంపెనీ నుంచి వెలువడే కాలుష్యం గురించి సంస్థ తీసుకుంటున్న జాగ్రత్తల గురించి మేనేజర్ బిస్వాల్‌తో చర్చించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె.పరశురామ్, వేదిక పర్యావరణ పరిరక్షణ జిల్లా కన్వీనర్ డాక్టర్ పాలూరు లక్ష్మణ స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యానికి 'హెల్పింగ్ హ్యాండ్స్' సహకారం


రాము కుటుంబ సభ్యునికి రూ.25వేలు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ కొత్తపేటకు చెందిన గొర్లె రాము ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం కోమాలో ఉన్న ఈయన చికిత్స కోసం రూ.5 లక్షలు అవసరం అవుతుంది. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో సాయమందించేందుకు హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ముందుకొచ్చింది. దాతల సహకారంతో వారం రోజుల పాటు సేకరించిన రూ.25 వేలను రాము కుటుంబ సభ్యులకు మంగళవారం ఆస్పత్రిలో అందించారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ రాము వైద్యానికి ఆర్థిక సాయం చేయాలనుకునేవారు 7207957547 నంబరులో సంప్రదించాలని కోరారు. లేదా అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ మహరాణిపేట ఎస్‌బీఐ బ్రాంచ్ ఖాతా నంబర్ 42659676487(BIN 0000754) ద్వారా అందించాలని విజ్ఞప్తి చేశారు.

'అనిట్స్' కూడలిలో వాహనాల గందరగోళం


మూడువైపులా వాహనాల రాకతో నిలిచిపోయిన ట్రాఫిక్

తగరపువలస: సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయాల ఎదురుగా గల కూడలిలో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నిలిచిపోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అత్యంత రద్దీగా ఉండే ఈ సర్వీస్ రోడ్డులో వ్యాపారులు తమ పరిధి దాటి ముందుకు రావడం, ద్విచక్రవాహనదారులు సర్వీస్ రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడంతో రోజూ ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొని ఉంటోంది. దీంతో ఈ కూడలి దాటడానికి వాహనదారులు నిమిషాల కొద్దీ సమయం కేటాయించవలసి వస్తోంది. ఆలయాలకు వచ్చే భక్తులతో పాటు అనిట్స్‌కు వచ్చే విద్యార్థులు, ఎన్ఆర్ఐ ఆస్పత్రికి వచ్చే రోగులతో ఈ కూడలి సందడిగా ఉంటుంది. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఈ కూడలికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, ముందుకు వచ్చిన దుకాణాలను తొలగించాలని కోరుతున్నారు. స్టాపర్లు ఏర్పాటు చేసి వాహనాల వేగంతో పాటు జాప్యాన్ని నివారించాలని భీమిలి ట్రాఫిక్ విభాగ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆహార నాణ్యత కచ్చితంగా పాటించాలి

ఎంవీపీకాలనీ: విద్యార్థుల సంక్షేమంతో పాటు హాస్టళ్లలో ఆహార నాణ్యత కచ్చితంగా పాటించాలని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు జిల్లాలోని వివిధ హాస్టళ్ల వార్డెన్లకు సూచించారు. ఈ మేరకు మంగళవారం డీఆర్‌డీఏలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. హాస్టళ్ల నిర్వహణపై వార్డెన్‌లతో, స్కాలర్‌షిప్స్ చెల్లింపులపై ఫీల్డ్ ఆఫీసర్లతో వేరువేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో బయట ఆహారాన్ని అనుమతించవద్దన్నారు. నాణ్యతమైన ఆహారం విద్యార్థులకు అందించడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచడంతో పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం చేయాలని వార్డెన్లను ఆదేశించారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల చెల్లింపు కోసం ఎస్సీ, బీసీ, గిరిజన వెల్ఫేర్ హాస్టల్స్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. హాస్టళ్ల నిర్వహణ, సౌకర్యాలపై నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వర్కుషాపు కోసం అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.